APTEL/26/A0542

# స్ఫూర్తి పత్రిక

Voice of Truth

విలేకరులు కావలెను
స్ఫూర్తి పత్రిక డైలీ పేపర్ నందు
కర్నూలు,నంద్యాల,అనంతపురం, శ్రీ సత్యసాయి, వైయస్సార్ ,తిరుపతి, అన్నమయ్య ,చిత్తూరు ,జిల్లాలలో పనిచేసేందుకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నియోజకవర్గ ఇన్చార్జీలు మండల రిపోర్టర్స్ కావలెను.
స్ఫూర్తి పత్రిక Voice of Truth
గతంలో పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం వార్తలు చక్కగా రాయగలిగే నైపుణ్యం గల వారికి అవకాశం కలదు.
ఎటువంటి యాడ్స్ టార్గెట్లు లేదు.
కొత్త వారికి అవకాశం కలదు.
ఆసక్తి గలవారు సంప్రదించండి : 8179446036,7794947413.

ప్రచురణ : కర్నూలు | సంపాదకుడు : నరసనాయుడు బోయ | సంపుటి : 01 సంచిక :76 | పేజీలు : 04 వెల రూ. 2/- | బుధవారం 13-05-2026

PUBLICATION : KURNOOL | EDITOR : NARASANAIDU BOYA | VOLUME : 01 ISSUE : 76 | PAGES : 04 PRICE : 2 | WEDNESDAY, 13 MAY 2026

Kurnool Edition | Covering Andhra Pradesh & Telangana |

## బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు పదవీ గండం

- బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు పదవీ గండం పొంచి ఉందా? సొంత వాళ్ల నుంచే తీవ్ర ఒత్తిడి పెరుగుతోందా? పెద్ద ఎత్తున రాజీనామాకు డిమాండ్ ఎందుకు పెరిగింది.యూకేలో అసలేం జరుగుతోంది.



బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు పదవీ గండం పొంచి ఉందా? సొంత వాళ్ల నుంచే తీవ్ర ఒత్తిడి పెరుగుతోందా? పెద్ద ఎత్తున రాజీనామాకు డిమాండ్ ఎందుకు పెరిగింది. మిగతా 2లో

## ఈసారి టచ్ చేస్తే అణుదాడే..? అమెరికాకు ఇరాన్ ఘాటు వార్నింగ్..!

- అమెరికా లేదా ఇజ్రాయెల్ దళాలు మరోసారి తమపై దాడి చేస్తే .. తమ దేశంలోని యురేనియం నిల్వలను 90 శాతం స్వచ్ఛతకు అంటే, ఆయుధాల తయారీకి అవసరమైన స్థాయికి శుద్ధి చేస్తామని ఇరాన్ హెచ్చరించింది.



అమెరికా లేదా ఇజ్రాయెల్ దళాలు మరోసారి తమపై దాడి చేస్తే .. తమ దేశంలోని యురేనియం నిల్వలను 90 శాతం స్వచ్ఛతకు అంటే, ఆయుధాల తయారీకి అవసరమైన స్థాయికి శుద్ధి చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. మిగతా 2లో

## పాకిస్థాన్‌లో భారీ పేలుడు, ఏడుగురి మృతి

- పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురి మృతి చెందారు.
- వాయువ్య పాకిస్థాన్‌లోని లక్కీ మార్వాట్ ప్రాంతంలోని ఓ మార్కెట్‌లో జరిగిన శక్తిమంతమైన పేలుడులో ఇద్దరు పోలీసు అధికారులతో సహా ఏడుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు



పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురి మృతి చెందారు. వాయువ్య పాకిస్థాన్‌లోని లక్కీ మార్వాట్ ప్రాంతంలోని ఓ మార్కెట్‌లో జరిగిన మిగతా 2లో

## శ్రీవాణి ట్రస్టు తెలుగుదేశం పార్టీ దోపిడీతో మసకబారుతోంది.




- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ప్రెస్‌మీట్ ముఖ్యాంశాలు
- వైయస్సార్సీపీ హయాంలో హిందూ ధర్మ పరిరక్షణకు శ్రీవాణి పథకం దీపపు స్తంభంలా నిలిచింది.
- పవిత్ర ఆశయంతో మొదలైన శ్రీవాణి ట్రస్టు తెలుగుదేశం పార్టీ దోపిడీతో మసకబారుతోంది.
- టీటీడీ నిధులను తెలుగుదేశం నాయకులకు చంద్రబాబు దోచిపెడుతున్నాడు శ్రీవాణి బ్రేక్ దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో నిమిషంలోనే అయిపోతున్నాయి. మిగతా 2లో

## టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్లకు జిల్లాలు

# కేటాయించిన సీఎం

### ప్రాంతాల వారీగా కలెక్టర్ల నియామకం

### ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం..

### జీఓ ఎంఎస్ నంబర్14 విడుదల

- రెండేళ్ల పదవీకాలం
- టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్లకు సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాలు కేటాయించారు.
- ఆయా జిల్లాల కో ఆర్డినేటర్లు.. నేటి నుంచే జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.
- రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా కలెక్టర్లను ప్రభుత్వం నామినేట్ చేసింది
- ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ స్టేట్ వెల్ఫేర్ బోర్డులో నామినేట్ సభ్యులుగా ముగ్గురు ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులకు అవకాశం కల్పించింది
- కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్క జీవన్ కుమారి, బోను దుర్గలను బోర్డు సభ్యులుగా నియమించింది.
- ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, నియమిత సభ్యుల పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక భద్రత వంటి అంశాల్లో మరింత సహకారం అందించేందుకు చర్యలు చేపడుతోంది.



టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్లకు సీఎం చంద్రబాబు నాయుడు జిల్లాలు కేటాయించారు. ఆయా జిల్లాల కో ఆర్డినేటర్లు.. నేటి నుంచే జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించాలని రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు.పార్లమెంట్ల పరిధులలో ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో మిగతా 2లో

## రెండేళ్లలో 'హై లెవెల్ కెనాల్' పూర్తి చేస్తాం



- మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామంలో శ్రీ సీతారాముల స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠా పూజా కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.
- అనంతరంపల్లవోలు గ్రామ పంచాయతీలో వేసిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.
- మర్రిపాడు మండలంలోని ముగ్గురికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 2.47 వేల రూపాయల చెక్కులు అందజేశారు.


మర్రిపాడు: మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామంలో శ్రీ సీతారాముల స్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్ఠా పూజా కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.అనంతరంపల్లవోలు గ్రామ పంచాయతీలో వేసిన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అలాగే మర్రిపాడు మండలంలోని ముగ్గురికి మిగతా 2లో

## 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'ను

# కలవడం సంతోషంగా ఉంది

### గౌహతిలో కేంద్ర మంత్రి గడ్కరీతో చంద్రబాబు, లోకేష్ భేటీ

- అసోం సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన నేతలు
- గడ్కరీని 'హైవే మ్యాన్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించిన లోకేష్
- ఏపీలో జరుగుతున్న పనులను గడ్కరీ ప్రశంసించారని వెల్లడి



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గౌహతిలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అసోం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన వీరు, గౌహతి విమానాశ్రయంలో మిగతా 2లో

## ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభంపై మంత్రి పొంగులేటి బిగ్ అప్‌డేట్



ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్

అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో మిగతా 2లో

## ఇన్నాళ్లూ సోషల్ మీడియా సైనికులను

# అక్రమ కేసులతో వేధించార

### జగనన్న కనెక్ట్స్‌పై కూటమి కుట్ర

- సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్ చేయించే ఎత్తుగడ
- వాస్తవాలను ప్రజల ముందుకి తెస్తుంటే ప్రభుత్వంలో తత్తరబాటు
- ఇప్పుడు ఏకంగా అకౌంట్లు సస్పెండ్ చేయించాలని మెటా, ఎక్స్‌కి నోటీసులు పంపుతున్నారు
- విమర్శలకు సమాధానం చెప్పకోలేక ప్రభుత్వ భయపడిపారిపోతోంది




చంద్రబాబు అసమర్థత, ప్రభుత్వ అవినీతిని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేక జగనన్న కనెక్ట్స్ సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్ చేయించే కుట్రలకు చంద్రబాబు తెరలేపాడని వైయస్సార్సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మిగతా 2లో

## నూతన వధూవరులకు వైఎస్ జగన్ ఆశీర్వాదం



- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా పామిడిలో పర్యటించారు
- ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు కుమార్తె లిఖిత, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్ కుమారుడు చైతన్యమిత్రల వివాహం ఇటీవల జరిగింది. . మిగతా 2లో

## '500 రోజులకు పైగా జైలు శిక్ష..

# మళ్లీ బెయిల్ తిరస్కరణ.

### హక్కుల కోసం పోరాడటం నేరమా?

### బంగ్లాదేశ్ హిందూ సాధువుకి బెయిల్ నిరాకరణపై పవన్ కల్యాణ్ ఫైర్!

### మరిన్ని విజయాలు సాధించాలి: పవన్ కల్యాణ్‌పై అన్నామలై ప్రశంసలు

- బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ మాంక్, హిందూ ఆధ్యాత్మిక గురువు చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు పదే పదే బెయిల్ నిరాకరించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో స్పందించారు.
- మంగళవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బంగ్లాదేశ్ న్యాయ వ్యవస్థ తీరును, అంతర్జాతీయ నకిలీ లౌకికవాదుల మౌనాన్ని తీవ్రంగా ఎండగట్టారు.
- కాషాయం ధరించిన ఓ సాధువును నేరస్థుడిలా చూస్తుంటే ప్రపంచం మౌనంగా ఉండలేదని ఆయన స్పష్టం చేశారు.
- తక్షణమే ఆయనకు వైద్య సహాయం అందించడంతో పాటు, న్యాయమైన విచారణ జరపాలని బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని డిప్యూటీ సీఎం కోరారు.
- దేశద్రోహం ఆరోపణల కింద 2024 నవంబర్ 25న ఢాకా విమానాశ్రయంలో అరెస్ట్ అయిన చిన్మయ్ కృష్ణ దాస్‌కు బంగ్లాదేశ్ హైకోర్టు ఆదివారం బెయిల్ నిరాకరించింది.

బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ మాంక్, హిందూ ఆధ్యాత్మిక గురువు చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుకు పదే పదే బెయిల్ నిరాకరించడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో స్పందించారు. మంగళవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా బంగ్లాదేశ్ న్యాయ వ్యవస్థ తీరును, అంతర్జాతీయ నకిలీ లౌకికవాదుల మిగతా 2లో



## అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



- సిబ్బంది కొరత ఉన్నచోట దశల వారిగి ఖాళీలు భర్తీ చేయండి
- రాష్ట్ర అగ్నిమాపక శాఖ పనితీరుపై హోంమంత్రి వంగలపూడి అనిత సమగ్ర సమీక్ష నిర్వహించారు.
- రాష్ట్రంలో ఫైర్ స్టేషన్లు లేని 22 నియోజకవర్గాల పరిస్థితిపై అధికారులతో చర్చించిన మంత్రి, కొత్తగా ప్రతిపాదించిన 5 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మిగతా 2లో

# ఆలూరులో జనసమాజ్ పార్టీ ఆవిర్భావం





## సమస్యల పరిష్కారమే లక్ష్యమన్న నాయకులు

**ఆలూరు:స్ఫూర్తి పత్రిక** : ఆలూరులోని ఉమా కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన రాజకీయ అవగాహనా సదస్సులో "జనసమాజ్ పార్టీ"ని ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కే. వీరారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బోయ కుమారరాముడు, సెక్రటరీగా కే. జయరాములు, ట్రెజరర్‌గా బి. గోపాల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు కే. వీరారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు గడిచినా దేశంలోని గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదన్నారు. విద్య, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి అంశాల్లో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గంలో తాగునీరు, ఉద్యోగాలు, సంక్షేమం, పారిశ్రామిక రంగ సమస్యలు దశాబ్దాలుగా పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం, సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే జనసమాజ్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ విధివిధానాలు, పూర్తి కమిటీలు త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. సదస్సులో పలువురు యువకులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నాన్ వెజ్ తినలేని వారికి వరం ఈ గింజలు..

## తరచూ తింటే ఎన్నో లాభాలు..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం వ్యాయామం చేయడం మాత్రమే కాదు, ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా తినాల్సి ఉంటుంది. కొందరు వ్యాయామం అయితే చేస్తారు కానీ అనారోగ్యకరమైన ఆహారాలను తింటారు. దీంతో వ్యాయామం చేసిన ఫలితం దక్కదు. కనుక ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం కూడా ముఖ్యమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక అలాంటి ఆరోగ్యకరమైన శక్తినిచ్చే ఆహారాల్లో రాజ్మా గింజలు కూడా ఒకటి. ఇవి చిక్కుడు జాతికి చెందినవి. చూసేందుకు ముదురు గోధుమ రంగులో అచ్చం కిడ్నీల్లాగే ఉంటాయి. అందుకనే ఈ గింజలను కిడ్నీ బీన్స్ అని కూడా అంటారు. రాజ్మా గింజలను ఉత్తరాది వారు ఎక్కువగా తింటారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. ఈ గింజలను తినడం వల్ల శక్తి లభించడమే కాదు, పోషకాలను కూడా పొందవచ్చు. అలాగే పలు వ్యాధులను నయం చేసుకోవచ్చు. రాజ్మాను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**అధికంగా ప్రోటీన్లు..**

రాజ్మా గింజల్లో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా నాన్ వెజ్ తినలేని వారు ఈ గింజలను తింటే ప్రోటీన్లు అధికంగా లభిస్తాయి. దీని వల్ల శరీర కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. కండరాలు నిర్మాణమవుతాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఒక కప్పు రాజ్మా గింజలను తింటే చాలు మనకు రోజుకు కావల్సిన ప్రోటీన్లు మొత్తం లభిస్తాయి. అందువల్ల నాన్ వెజ్ తినలేని వారికి రాజ్మా గింజలు ఉత్తమ ఆహారం అని చెప్పవచ్చు. అలాగే శారీరక శ్రమ చేసేవారు, వ్యాయామం అధికంగా చేసే వారు సైతం ఈ గింజలను తినవచ్చు. దీంతో కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చు. కండరాలు నిర్మాణమవుతాయి. మళ్లీ ఉత్సాహంగా పనిచేసేందుకు కావల్సిన శక్తి లభిస్తుంది. చురుగ్గా ఉంటారు. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. బలహీనంగా ఉన్నవారు రాజ్మాను ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.


**మలబద్దకానికి చెక్..**

ఈ గింజలను తింటే ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. దీంతో పేగుల్లో మలం కదలికలు సులభతరం అవుతాయి. మలబద్దకం తగ్గుతుంది. ఈ గింజలు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సులభంగా శోషించుకుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ సైతం పటిష్టంగా మారుతుంది. రోగాలు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలు తగ్గుతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**షుగర్ ఉన్నవారికి..**

రాజ్మా గింజల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ గింజలను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. పైగా ఈ గింజల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక షుగర్ లెవల్స్‌ను తగ్గేందుకు దోహదం చేస్తుంది. రాజ్మాను తింటే శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ కంట్రోల్ అవుతుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ గింజల్లో ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. అధిక బరువు ఉన్నవారు ఈ గింజలను తింటే త్వరగా బరువు తగ్గుతారు. ఈ గింజల్లో ఉండే క్యాల్షియం ఎముకలను బలంగా మారుస్తుంది. ఇలా రాజ్మా గింజలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# రైతుకు తోడై నిలిచిన పరిశోధన




ఋతుపవనాల ఎగుళ్ళు దిగుళ్ళు, ఉష్ణ మండల ప్రాంతపు సముద్ర తలాల ఉష్ణోగ్రతలూ, తత్కారణంగా జరిగే ఉష్ణ సంవహన ప్రక్రియలకు సంబంధించి నాలుగున్నర దశాబ్దాల క్రితం తన పరిశోధనతో భారతదేశపు వ్యవసాయాన్ని, పంటలనూ, దేశ ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేసిన ప్రొ. సులోచనా గాడ్గిల్ 81 సంవత్సరాల వయసులో ఈ జూలై 24న బెంగళూరులో కన్నుమూశారు. ఆమె పరిశోధనల్లో స్థూలంగా గణిత, భౌతిక శాస్త్రాలుబీ వాతావరణ, సముద్ర శాస్త్రాలుబీ వ్యవసాయం, ఆర్థిక శాస్త్రం మొదలైన విభాగాలు కలగలిశాయి. భారత ఋతుపవనాల గురించి అమోఘంగా కృషి చేసి, మూడు వందల ఏళ్ళుగా మనకు ఉన్న అవగాహనను విస్తృతం చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్త డా. సులోచనా గాడ్గిల్. భారత స్వాతంత్ర్యోద్యమంలోనే కాదు, మహిళా విమోచనా కార్యక్రమాలలో కూడా ఒకటిన్నర శతాబ్దం చరిత్ర ఉన్న పూణె నగరంలో సులోచన 1944 జూన్ 7న వేశ్వంత్ పాథక్, ఇందుమతి దంపతులకు జన్మించారు. వీరికి కలిగిన నలుగురు ఆడపిల్లల్లో ఈమె మూడవ సంతానం. ఈమె తాత వైద్యుడిగా సేవలందిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వ్యక్తి. కనుక వాళ్ళింటికి ఎప్పుడూ ఆయన మిత్రులైన పోరాట యోధులు వస్తూ వెడుతూ ఉండేవారు. తండ్రి అల్లోపతిలో ఎం.డి. పట్టాతో పాటు ఆయుర్వేద, - యోగ విధానాలలో పూర్తిగా అవగాహన ఉన్న వైద్యులు. తల్లి మరాఠీ సాహిత్యరంగంలో ప్రముఖులు. పూణెలో ప్రాథమిక విద్య తర్వాత ఆమె హైస్కూల్ విద్య కోసం ఏపీ లోని మదనపల్లి దగ్గర ఉన్న ఋషి ర్యాలీలో చేరారు. మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా ఇష్టమైన అంశాన్ని, ఇష్టమైన రీతిలో చదివే అవకాశం తనకు అక్కడ లభించిందనిబీ అదే దృష్టి తన చదువును, జీవితాన్ని తీర్చిదిద్దిందని ఆమె చెప్పేవారు. పూణెలోని ఫెర్గ్యూసన్ కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌తో బీఎస్సీ చేసిన తర్వాతబీ పూణె విశ్వవిద్యాలయం నుంచి అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో ఎంఎస్సీ 1965 లో పూర్తి చేశారు. ఒకసారి బోర్ కొట్టే క్లాసు ఎగ్గొట్టడానికి కిటికీలోంచి దూకుతున్న సులోచన రెండేళ్లు సీనియరైన మాధవ్ గాడ్గిల్ దృష్టిని ఆకర్షించారు. సులోచన ఎమ్మెస్సీ చదివే సమయంలో మాధవ్ గాడ్గిల్‌తో ఆమె పెళ్ళి జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ ఫెలోషిప్ మీద హార్వర్డు యూనివర్సిటీలో చేరారు. పక్షులు, సీతాకోకచిలుకలు, ఏనుగులు, మేఘాలు, నక్షత్రాలు, తోకచుక్కలు పరిశీలించడం తన హాబీ అని చెప్పుకునే సులోచనా గాడ్గిల్ ప్రకృతి ప్రపంచం మీద ఆసక్తి కలిగి హార్వర్డ్ యూనివర్సిటీలో 'ఫిజికల్ ఓషనోగ్రఫీ' అంశాన్ని ఎంచుకున్నారు. తనకు ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ లలో లోతైన అవగాహన ఉందనీబీ అదే సమయంలో తన భర్త మాధవ్‌కు మ్యాథమెటికల్ ఎకాలజీ, ఎవల్యూషనరీ బయాలజీ ఆసక్తికరమైన విషయాలు కావడం వల్ల తన అధ్యయనం హాయిగా సాగిందనీ ఆమె చెప్పేవారు. ప్రొఫెసర్ ఎ.ఆర్. రాబిన్‌సన్ వద్ద ఫిజికల్ ఉష్ణోగ్రఫీ పూర్తి చేసిన తర్వాతబీ అక్కడే ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొ. జూల్స్ చర్నీ వద్ద 'ప్లానిటరీ ఫ్లూయిడ్ డైనమిక్స్'లో పీహెచ్డీ పూర్తి చేశారు. తర్వాత ఋతుపవనాల మీద ఆసక్తి కలిగి చర్నీ వద్దనే ఎమ్ఐటీలో పోస్ట్-డాక్టోరల్ రీసెర్చ్ ముగించారు.

అమెరికాలో ఆరేళ్ల పాటు మూడు విలక్షణమైన విభాగాలను శోధించి భర్తతో కలిసి 1971లో భారతదేశం తిరిగి వచ్చారు. అప్పటికి ఆమె ఋతుపవనాల తీరుతెన్నుల గురించి పట్టు సాధించడంతో వాతావరణంలో మార్పులను విశ్లేషించే రీతిలో పరిశోధన చేపట్టడానికి సాహసం చేశారు. ఈ పరిశోధన కొనసాగింపుగా పంటలకొచ్చే తెగుళ్ళు, రోగాలు, కరువు పరిస్థితులు వంటివి ముందుగా వివరించే రీతిలో దేశానికి దోహదపడ్డారు. 1971లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత సులోచనా గాడ్గిల్ సీఎస్ఐఆర్ పూల్ ఆఫీసర్‌గా పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీరాలజీలో ఓ రెండేళ్ల పాటు పనిచేయడంతో వాతావరణానికి సంబంధించి నిష్ణాతులైన ఆర్. అనంతకృష్ణన్, డి.ఆర్. శిక్కా లతో పరిశోధన చేసే అవకాశం కలిగింది. 1973లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్‌గా ప్రముఖ అంతరిక్ష విజ్ఞానవేత్త సతీష్ ధావన్ ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో ఋతుపవనాల గురించి పరిశోధన చేయాలని సెంటర్ ఫర్ థియరిటికల్ స్టడీస్ విభాగాన్ని ప్రారంభించి, సులోచనా గాడ్గిల్‌ను ఆహ్వానించి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తీసుకున్నారు. అదే సమయంలో అదే విభాగంలో మ్యాథమెటికల్ ఎకాలజీకి సంబంధించి మాధవ్ గాడ్గిల్ కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం పొందారు. క్రమంగా ఈ విభాగమే 'సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్'గా మారి ఇక్కడ విశేషమైన పరిశోధనలు జరిగాయి. ఉష్ణమండల సముద్రాల పైన ఉండే మేఘమాలికల వర్షస్వభావం అనేది ఆయా సముద్రతలాల ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత 28డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉందని సులోచనా గాడ్గిల్ బృందం చేసిన పరిశోధనలలో తేలింది. నేరుగా జన సామాన్యంతో, దేశ ఆర్థిక భద్రతతో ముడిపడిన పరిశోధనాంశం కనుక ఆమె సదా రైతులతో ముచ్చటిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసేవారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం లోని పావగడ ప్రాంతపు రైతుల నుంచి తెగుళ్లు, చీడపీడల గురించి సమాచారం అందుకొని పరిశోధన కొనసాగించడం విశేషం. 2016లో భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తూ 'ఏ ఆర్థిక శాస్త్రవేత్తా సాధించని రీతిలో సులోచనా గాడ్గిల్ విజయం సాధించార'ని పేర్కొన్నది. గత ఐదు దశాబ్దాలలో మనదేశపు జీడీపీలో వ్యవసాయం పాత్ర తగ్గినాబీ కరువు ప్రభావం మాత్రం అలాగే రెండు నుంచి ఐదు శాతంగా దాదాపు స్థిరంగా ఉందని ఈమె పరిశోధన తేల్చింది. సులోచన భర్త మాధవ్ గాడ్గిల్ జీవావరణ శాస్త్రవేత్త మాత్రమే కాకుండా రచయితగా, కాలమిస్ట్‌గా కూడా ప్రఖ్యాతులు. పశ్చిమ కనుమల జీవావరణాన్ని అధ్యయనం చేయడానికి 2010లో ఏర్పరిచిన గాడ్గిల్ కమిషన్‌తో సుప్రసిద్ధులు. సులోచనా గాడ్గిల్ కూతురు జర్నలిస్టుగా ఉంటూ స్పానిష్ భాషను బోధిస్తుంటారు గురించి విశేషమైన పరిశోధన చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా కలకాలం గుర్తుండిపోతారు.

# వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

## ఆలూరులో వీఆర్‌పీఎస్ నాయకుల డిమాండ్



**ఆలూరు:స్ఫూర్తి పత్రిక** : వాల్మీకులను రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ జాబితాలో చేర్చాలని వీఆర్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆలూరు గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పిస్తామని హామీలు ఇస్తున్నప్పటికీ, ఎన్నికల అనంతరం వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. వాల్మీకుల హక్కుల సాధన కోసం హైవే దిగ్బంధాలు, రాస్తారోకోలు, పులి కేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో వాల్మీకులకు ఎస్టీ హోదా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కొన్ని జిల్లాల్లో మాత్రమే ఆ హోదా కల్పించి, మరికొన్ని జిల్లాల్లో బీసీలుగా కొనసాగించడం అన్యాయమన్నారు. రాష్ట్రం, కేంద్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం కొనసాగుతున్న నేపథ్యంలో వెంటనే స్పందించి రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ సమావేశంలో వీఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ విరపాపురం, తాలూకా అధ్యక్షుడు వీరాంజినేయులు, మండల అధ్యక్షులు వరుణ్, భాస్కర్, వీరేష్, కృష్ణ నాయుడు, శివరాం, నాయుడు, సురేంద్ర తదితర వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

# వేదావతి ప్రాజెక్టు పనులు వెంటనే ప్రారంభించాలి

## భారత కమ్యూనిస్ట్ పార్టీ (సి పి ఐ)

## మే 14న ఆలూరులో రౌండ్ టేబుల్ సమావేశం



**హోళగుంద, మే 12, స్ఫూర్తి పత్రిక-** వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కీలకమైన వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి తక్షణమే నిధులు కేటాయించి, పనులు ప్రారంభించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సి పి ఐ) పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సి పి ఐ కర్నూలు జిల్లా సమితి నాయకులు మాట్లాడుతూ, ఆలూరు ప్రాంత సాగునీరు మరియు త్రాగునీటి కష్టాలు తీరాలంటే వేదవతి ప్రాజెక్టు పూర్తి కావడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా క్షేమం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన సమయం వచ్చిందని, ఈ నెల 14 నఆలూరు నియోజకవర్గ కేంద్రంలోని ఉమా కళ్యాణ మండపం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కీలక సమావేశంలో సి పి ఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ పాల్గొని ప్రసంగించనున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు రైతులు అధిక సంఖ్యలో హాజరై తమ అమూల్యమైన సూచనలు ఇవ్వాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పెద్దహ్యాట మారెప్ప, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు కొత్తపల్లి గిడ్డయ్య,రైతు సంఘం నాయకులు లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

# జల ఖడ్గం

జల ఖడ్గంతో అడుగులేస్తూ గొంతులు తడిపే భాగ్యానికి చేతులు కలుపుతూ సాగాలి తడి ఆరిన బతుకుల్లో చైతన్యం ఒంపుతూ కదలా నీరుగారిన జీవనాల్లో కన్నీరును తుడిచిపెట్టాలి ఒక వంతు పోరాటం మరో తంతు ఆరాటమై పదును తగ్గిన కాల్వలకు అదును చూసి పదును పెట్టాలి జల ఉద్యమ వెలుగు రేఖలై ప్రతి మనిషి ముందుకెళ్లాలి పోరాటపు పటిమతోటి పంటల గొంతును తడపాలి ఎండిన నేలకు చేదోడుగా ఉద్యమ స్ఫూర్తితో భుజం తట్టి తడి నింపుతూ ఊపిరి కావాలి జలం కోసం జనం కదిలి ఏకస్వరమై ఏకమై ప్రతిఘటిస్తూ జలం హక్కు నినాదమై సంఘటితమై సాధించుకోవాలి అక్షర యజ్ఞానికి సిరాతో ఆజ్యం పోస్తూ కవనాలతో మమేకమౌతూ మనసులోని భావాలు కెరటాలై ఉవ్వెత్తున ఎగరాలి జల ఖడ్గం పదును తీరులో సామరస్యం ఉప్పొంగిపోవాలి అక్షరాలతో కవన యుద్ధం చేయాలి మసును కదిలించే కావ్యానికి వెలుగు నింపుతూ వెళ్లాలి

# ట్రంప్ టారిఫ్ దూకుడు

మన దేశంలో తయారైన సరుకులు అమెరికాకు ఎగుమతి చేయాలంటే 25 శాతం సుంకం కట్టక తప్పదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫర్మానా జారీచేశారు. ఓ వైపు వాణిజ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ ఇలా పాతిక శాతం టారిఫ్ ప్రకటించడం, దీనికి అదనంగా జరిమానా విధిస్తామని చెప్పడం భారత్‌ను దిగ్భ్రాంతికి గురిచేసింది. రష్యా తో సన్నిహిత సంబంధాలు, రక్షణ, ఇంధన లావాదేవీలు కొనసాగిస్తున్నందుకు భారత్‌కు ట్రంప్ వేసిన శిక్ష ఇది. నిజానికి ట్రంప్ భారత్‌పై విరుచుకుపడటం ఇదే మొదటిసారి కాదు. తొలి విడత పదవీకాలంలోనే ఆయన కరోనా సమయంలో మందుల సరఫరా విషయమై భారత్ మెడలు వంచేందుకు ప్రయత్నించారు. ఇక రెండో విడత పదవి చేపట్టిన తర్వాత వీసాలు, ఉద్యోగాల విషయంలో భారత్‌పై కత్తులు నూరుతూనే ఉన్నారు. మొన్నటికి మొన్న బ్రిక్స్‌లో డాలర్‌కు ప్రత్యామ్నాయం గురించిన ప్రస్తావన రాగానే భారత్ సహా కూటమిలోని దేశాలన్నిటిపై వంద శాతం టారిఫ్ వేస్తానని బెదిరించారు. ట్రంప్ ముందుగా చెప్పినట్టుగానే ఇప్పుడు టారిఫ్ వేశారు. 'అబ్ కీ బార్ ట్రంప్‌కి సర్కార్' అని గతంలో ప్రచారం చేసిన మోదీ.. ట్రంప్‌కు కళ్లెం వేయడంలో విఫలమవుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి పర్యవసానంగా పాక్‌పై భారత్ జరిపిన సైనికదాడిని 'నేనే ఆపించాను' అని ట్రంప్ పదే పదే చెప్పుకొన్నారు. దీంతో విధానపరంగా మోదీ ప్రభుత్వం ఆత్మసమర్థనలో పడింది. పాక్‌తో తృతీయపక్షం మధ్యవర్తిత్వం అంగీకరించరాదన్నది భారత్ సుస్థిర విధానం. ఇప్పుడు అదికాస్తా నీరుగారిపోయింది. ఇప్పుడు టారిఫ్ యుద్ధం ప్రకటించినా భారత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నది తప్ప, దీటైన జవాబివ్వడం లేదు. కనీసం బ్రెజిల్ ప్రభుత్వం అమెరికాను ఎదిరిస్తు న్న స్థాయిలో కూడా మోదీ సర్కారు వ్యతిరేకించకపోవడం ప్రధాని అశక్తతను బయటపెడుతున్నది. ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త సుంకాలకు సంబంధించి రం గాలవారీగా రేట్ల గురించిన సవివర సమాచారం ఇంకా అందుబాటు లో రానప్పటికీ, మన దేశంలోని వస్త్ర, ఔషధ, ఆభరణాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఫార్మా పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతాయని అం చనా వేస్తున్నారు. వీటి మీద ఆధారపడిన కోట్ల మంది ఉద్యోగుల కుటుంబాలూ ప్రభావితమవుతాయని చెప్పవచ్చు. ఈ దెబ్బతో దక్షిణాసియా దేశాల్లో భారత్‌కు అమెరికా ప్రాధాన్య హోదా కల్పిస్తుందన్న ఆశలూ ఇగిరిపోయాయి. మరోవైపు ఈ ప్రకటనను వెన్నంటే పాకిస్థాన్‌తో చమురు క్షేత్రాల అభివృద్ధిపై ఒప్పందానికి వచ్చినట్టు అమెరికా అధ్యక్షుడు వెల్లడించడం గమనార్హం. ఏకైక అగ్రరాజ్యానికి ఎవరు 'అత్యంత' సన్నిహితులో దీనితో తేలిపోయింది. మోదీ సర్కారు భారత విదేశాంగ విధానం దారుణ వైఫల్యాన్ని ఇది ఎత్తిచూపుతున్నది. భారత్ ఇప్పటికిప్పుడు అలీనోద్యమ కాలం నాటి స్వతంత్ర ప్రతిపత్తికి మళ్లడం సాధ్యపడకపోవచ్చు. కానీ, కనీసం బ్రెజిల్ తరహాలో అమెరికాకు దీటైన జవాబు ఇవ్వవచ్చు. అందుకు ఇతర దేశాలను కూడగట్టవచ్చు. ట్రంప్ నిరంకుశ ధోరణిని ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ నిలువరించలేం. ట్రంప్‌కు అమెరికా ప్రయోజనాలు ముఖ్యమైనప్పుడు మన కేంద్ర సర్కారుకు భారత ప్రయోజనాలే పరమావధి కావాలి కదా!.షుగర్ అనేది కేవలం వ్యాధి కాదు.. అది జీవనశైలికి సంబంధించిన పెద్ద హెచ్చరిక. చాలా మంది ప్రారంభ లక్షణాలను గుర్తించకపోవడం వల్ల సమస్య ఎక్కువవుతుంది. ఎక్కువ దాహం, అలసట, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తే తప్పకుండా వైద్య సలహా తీసుకోవాలి. ముందస్తు జాగ్రత్తలతో షుగర్‌ను అదుపులో ఉంచవచ్చు. షుగర్ జబ్బు మాత్రమే కాదు.. ఎక్కువగా మన జీవనశైలికి సంబంధించిన సమస్య. షుగర్ మొదట్లో కొన్ని ముఖ్యమైన లక్షణాలు కనిపించినా.. చాలా మంది వాటిని మామూలుగా తీసుకుంటారు. ఈ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే.. సమస్య తీవ్రం కాకుండా జాగ్రత్త పడవచ్చు. షుగర్ జబ్బును సూచించే 7 లక్షణాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

# మహిళల భద్రత సామాజిక బాధ్యత



రాష్ట్రంలో మహిళల భద్రత, సంక్షేమం- కేవలం ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమం మాత్రమే కాదు యావత్ సమాజం కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అంశం. విద్య, ఉపాధి, భద్రత వంటి రంగాలలో మహిళలు సాధిస్తున్న పురోగతికి తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం స్పష్టమవుతోంది. మహిళల భద్రతపై ఒక వైపు ప్రభుత్వం, మరో వైపు మహిళా కమిషన్, మహిళా సంఘాలు అనేక చర్యలు తీసుకుంటున్నా.. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హింసాత్మక ఘటనలు, లైంగిక దాడులు, వేధింపులు జరుగుతూనే ఉన్నాయి. పోలీసు వ్యవస్థను మరింత బాధ్యతతో, మహిళాభిముఖంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. సంస్కృతి, సంప్రదాయాలకు దిక్సూచిగా నిలిచే దేశంలో కూడా మహిళలకు ఆపదలు పెరిగిపోతున్న కాలంలో వారి భద్రత, రక్షణపై చైతన్యంతో కూడిన చర్చ అవసరం. స్త్రీ ఆత్మగౌరవంతో జీవించగల వాతావరణం ఎంత మేరకు ఉంది? రోడ్డుపై నడుస్తున్నా, వాహనాల్లో, ప్రయాణాల్లో, ఉద్యోగాల్లో, పాఠశాలల్లో... ఇలా అక్కడ, ఇక్కడ అని లేకుండా మహిళలను క్రూరమృగాల్లా వేధిస్తుండటం సమాజాన్ని కళంకితం చేస్తోంది. ఆఖరికి ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య కూడా స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితి. భారత రాజ్యాంగం మహిళలకు సమానత్వం, హక్కులు కల్పించినా ఆ హక్కులను ఉపయోగించుకునే పరిస్థితి అందరికీ సమంగా లేదు. మహిళలందరికీ భద్రత, రక్షణ చట్టాలపై అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. మహిళలపై అసభ్యంగా ప్రవర్తించడం, వేధింపులు, సైబర్ స్టాకింగ్ వంటి నేరాలపై ఐపీసీ, 1860 ప్రకారం సెక్షన్ 354, సెక్షన్ 354ఏడీ, అత్యాచారానికి సంబంధించి సెక్షన్ 375, సెక్షన్ 376లు వర్తిస్తాయి. వివాహిత మహిళపై భర్త, కుటుంబసభ్యుల మానసిక, శారీరక వేధింపులకు సెక్షన్ 498ఏ వంటి చట్టాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సెక్స్యువల్ హెరాస్మెంట్ ఆఫ్ ఉమెన్ అట్ వర్క్‌ప్లేస్ యాక్ట్ 2013బీ మైనర్ బాలికలకు రక్షణగా పాక్సో యాక్ట్ 2012 వంటి చట్టాల గురించి బాలికలకు తెలియజేయాలి.

రాష్ట్రంలోని మహిళల హక్కులకు రక్షణ, భద్రత, సురక్షత, సాధికారత కోసం మహిళా కమిషన్ ఏర్పడింది. సివిల్ కోర్ట్‌కి సమానమైన అధికారాలు కమిషన్‌కు ఉన్నాయని 1908 ప్రకారం సెక్షన్ 14 చెబుతుంది. సెక్షన్ 16(1) ప్రకారం బాధిత మహిళల నుంచి వచ్చిన న్యాయబద్ధమైన ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు కమిషన్ తీసుకుంటుంది. సెక్షన్ 16(3) ప్రకారం ఎవరైనా అభియోగం ఎదుర్కొంటున్న వ్యక్తి కమిషన్ ముందు నిర్దేశించిన తేదీ నాడు విచారణకు హాజరు కాకపోతే, కమిషన్ ఆ విషయంపై విచారణ నిర్వహించి, అభియోగం నిరూపణ అయితే తగు చర్యకై ప్రభుత్వానికి సిఫారసు చేయవచ్చు, లేదా ప్రాసిక్యూషన్‌ను కూడా ప్రారంభించవచ్చు. సెక్షన్ 21 ప్రకారం ప్రభుత్వం మహిళలకు సంబంధించిన అన్ని విధానపరమైన నిర్ణయాలను తీసుకునే ముందు కమిషన్‌ను సంప్రదించాలి. గృహ హింస, లైంగిక వేధింపులు వంటి అంశాలను కమిషన్ పరిశీలించి పరిష్కార చర్యలు సూచిస్తుంది. సోషల్ మీడియా, ప్రింట్/ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా తెలిసిన ఘటనలను సుమోటాగా స్వీకరించి సంబంధిత శాఖలకు సూచనలు చేస్తుంది. యూనివర్సిటీలు/కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. మహిళా కమిషన్ బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు అలుపెరగని కృషి చేస్తోంది. బాధిత మహిళలకు తోడుగా నిలిచేందుకు వన్ స్టాప్ సెంటర్లు, అత్యవసర పరిస్థితుల్లో 24/7 ఉచిత సేవలు అందించేందుకు మహిళా హెల్ప్‌లైన్ 181, శక్తి సదన్‌లు, శక్తి నివాస్ కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అదే విధంగా ప్రభుత్వాసుపత్రుల్లో మహిళలు, గర్భిణిల వార్డులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లోపాలను సరిచేస్తుంది. అధికారులతో సమీక్షలు నిర్వహించి సూచనలు చేస్తుంది.

కొద్ది రోజుల క్రితం ఒక జిల్లా జీజీహెచ్‌లో 50 మంది వైద్య విద్యార్థినులపై లైంగిక దాడులకు పాల్పడిన సిబ్బందిపై ఆ విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి ఘటన వివరాలు చెప్పారు. ఇలాంటి ఘటనలు ఎంతో మంది మహిళలకు ధైర్యాన్ని ఇస్తాయి. గత కొద్ది రోజులుగా జరుగుతున్న ఘటనలను నిశితంగా పరిశీలిస్తే మోసగాళ్ల ఉచ్చులోపడి బాలికలు అన్యాయంగా బలైపోతున్నారు. చిన్నారి బాలికలు, చదువుకుంటున్న అమ్మాయిలు అనవసర సమస్యల్లో చిక్కుకొని తమ జీవితాలను చెడగొట్టుకుంటున్నారు. ప్రభుత్వం, సామాజిక సంస్థలు, ప్రజలు కలిసి బాలికల రక్షణకు చర్యలు తీసుకోవాలి. బాలికలకు పాఠశాలలోనే తగిన లైంగిక విద్య, గుడ్ టచ్ %-% బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలి. ఉద్యోగావకాశాలు, చట్టసభల్లో మహిళల ప్రాధాన్యతను పెంచాలి. మీడియా, పాఠశాలలు, సామాజిక సంస్థలు కూడా మహిళల చైతన్యాన్ని పెంచే దిశగా ముందుకు రావాలి. తల్లిదండ్రులు, సంరక్షకులు పిల్లలపై నిరంతరం దృష్టి ఉంచాలి. ఏవైనా అసాధారణ ప్రవర్తనలు కనిపించినప్పుడు వాటిపై శ్రద్ధ వహించాలి. మహిళా హక్కుల పరిరక్షణ, సమానత్వ సాధన, న్యాయ కల్పనలో మహిళా కమిషన్ పోషిస్తున్న పాత్ర అనన్య సామాన్యమైనది. ఇది కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు సామాజిక మార్పుకు నిదర్శనంగా నిలుస్తున్న శక్తివంతమైన మాధ్యమం. అయితే, కమిషన్ పనితీరు మరింత సమర్థవంతంగా ఉండాలంటే ప్రభుత్వ సహకారం, న్యాయ వ్యవస్థ స్పందన, ప్రజల భాగస్వామ్యం అవసరం.

# వైవిధ్యం.. కాపాడుకుందాం

ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ వికాస సమితి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 'వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం' అనే అంశంపై ప్రముఖ సినీ నటులు ప్రకాశ్‌రాజ్ చేసిన ప్రసంగం పాఠం. ఇంతమంది నిబద్ధత ఉన్న మహానుభావులు, మేధావులు కూర్చున్న ఈ సభలో ఏం మాట్లాడాలో నాకర్థం కావడం లేదు. నేనెక్కడికి వెళ్లినా కొందరికి ఇబ్బందిగా ఉంటుంది కదా? అందుకే, జయశంకర్ గారికి, ప్రకాశ్‌రాజ్‌కు ఏంటి సంబంధం? ఆయనను ఎందుకు పిలుస్తున్నారన్నారంట? అనేది వారి ప్రశ్న. అలా అడిగినవాళ్లకు జయశంకర్ గారు అర్థం కాలేదు, నేను కూడా అర్థం కాను. మా ఇద్దరిదీ భావజాల బంధమే. అంతే తప్ప ఇంకేముంటుంది? ఈ రోజు కొందరు వక్తలు.. జయశంకర్ సార్ ఉండి ఉంటే స్వరాష్ట్రంగా తెలంగాణను చూడగలిగేవారు అన్నారు. ఈ మాటలు వింటుంటే నాకు తమిళ్‌లో పుదుమైపిత్తన్ అనే ఒక కవి మాటలు గుర్తొచ్చాయి. ఒక గుడి ముందు వెలుగుతున్న దీపానికి జనాలు నమస్కరిస్తుంటే పుదుమైపిత్తన్ ఒక అగ్గిపుల్లకు నమస్కారం చేశాడంట. ఎందుకనడిగితే.. వెలిగే జ్యోతికన్నా, వెలిగించిన అగ్గిపుల్ల పెద్దది కదా అన్నాడంట. అంటే, ఈ రోజు వెలుగుతున్న తెలంగాణ జ్యోతి ఏదైతే ఉందో.. దానికి అగ్గిపుల్ల జయశంకర్ సార్. ఈ రోజు ఆయన జయంతి రోజు మనమిక్కడ కలిశాం, ఆయన గురించి మాట్లాడుతున్నాం, ఆయన స్మరణ చేస్తున్నామంటే ఆయన తెలంగాణకు కారణమైన అగ్గిపుల్లే. ఈ వేదిక నుంచి నేను జయశంకర్ సార్ గురించి మాట్లాడుదామంటే.. ఆయనతో గడిపినవాళ్లు, కలిసి ప్రయాణం చేసినవాళ్లు అంతా మాట్లాడేశారు. ఇంకేదైనా కొత్తగా చెప్పాలంటే గూగుల్ సెర్చ్ చేయాలి. ఆ సంగతి అలా వదిలేస్తే నాకొక సబ్జెక్ట్ ఇచ్చారు మాట్లాడమని. భయమేసింది ఆ సబ్జెక్ట్ చూసినపుడు. అదేమంటే 'వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం'. ఎక్కడో కర్ణాటక నుంచి వచ్చాను సర్. తెలుగులో ఇట్లాంటి టైటిల్ ఇస్తే ఏంజేయాలి నేను? నాకేదో పెద్ద బ్రేకింగ్ న్యూస్‌లా వినపడిందది. కానీ ఆలోచిస్తే లేటెస్ట్ న్యూస్ కాదిది. వైషమ్యాల సుడిలో భారతం.. వైవిధ్యత.. అనేది లేటెస్ట్ న్యూస్ కాదు. చాలా పాత న్యూస్. మనం పేపర్ తీస్తే చూస్తాం కదా? వరద వచ్చి హైదరాబాద్ చెరువులా అయిపోయింది. లేటెస్ట్ న్యూసే, కానీ పాత న్యూసే. రెండేండ్ల కింద కూడా ఇలాగే ఉంది. ఎవ్వరో ఒక రైతు తన పిల్లల్ని , భార్యను చంపి తను ఆత్మహత్య చేసుకున్నాడు. లేటెస్ట్, బ్రేకింగ్ న్యూస్. లేటెస్ట్ న్యూస్ కాదిది. ఎవరో ఇద్దరు వేరే కులపోల్లు, ఆ జాతి, ఈ జాతి లేదు.

ప్రేమించుకున్నారు, పెండ్లి చేసుకున్నారు. ఊరోళ్లందరూ వెళ్లి వాళ్లను చంపేశారు. బ్రేకింగ్ న్యూస్ అంటారు. బ్రేకింగ్ న్యూస్ కాదది. రెండు సంవత్సరాల ముందు విన్నాం. పది సంవత్సరాల ముందు విన్నాం. మా నాన్న విన్నాడు, మా తాత విన్నాడు. ఆ దృశ్యాలు అప్పుడు కూడా చూశారు. ఇప్పుడు టీవీలో చూస్తున్నాం కదా? అది అప్పుడు కూడా చూశారు. అలాగే ఇది కూడా. వైషమ్యాల సుడిలో వైవిధ్య భారతం ఉంది కదా? అది బ్రిటిష్ వాళ్ల నుంచి, వాళ్ల ముందు నుంచి కూడా ఉంది. కానీ, ఇంకా మీరు ఇతిహాసం చూస్తే యావత్ ప్రపంచంలో, మానవ వికాసంలో ఈ వైవిధ్యాన్ని ఎప్పుడూ%ొ% ఎవరో ఒకరు దానిని వైషమ్యాల సుడిలో పెడుతూనే ఉన్నారు. ఎందుకు మనిషి తరతరాలుగా ఎందుకు, ఇంత అద్భుతమైన ఒక కాన్సెప్ట్‌ను వైషమ్యంలో పెడుతున్నాడని ఆలోచిస్తే.. అసలు డైవర్సిటీ అంటే ఏమిటో మనం అర్థం చేసుకోవాలి. వైవిధ్యత అంటే ఏంటి%ొ% ఇవాళ నన్ను పిలిపించింది కూడా అందుకే అనుకుంటా.. ఎందుకంటే.. బహుశా భారతదేశం కన్నా వైవిధ్యం ఏముంది? దాన్ని నాకన్న అనుభవించినవాళ్లెవరన్నా ఉన్నారా అంటే నాకు కనపడలేదు. ఎక్కడో ఒక సముద్రతీర ప్రాంతం మంగళూరు నుంచి వచ్చిన నాన్న.., ఇంకెక్కడో ఎండిపోయిన గదగ్, బెట్టకేరి, బళ్లారి లాంటి ప్లేస్ నుంచి వచ్చిన అమ్మ బెంగళూరులో స్థిరపడితే, అక్కడ పుట్టిన నేను.. తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, ఇలా ఎన్నో నదులు, ఎన్నో భాషలు, ఎంతో సాహిత్యం.. ఎందరో స్నేహితులు.. ఈ దేశానికి ఉన్న ఈ వైవిధ్యం.. దిస్ డైవర్సిటీ దీన్ని నాకన్న అనుభవించినవాడు ఇంకొకడు లేడేమో. ఈ వైవిధ్యత ఉంది కదా? ఇది, ఇక్కడున్న అందరికీతెలుసు. బట్ యంగ్‌స్టర్స్‌కి మనం ఇలాంటి ఒక విషయం గురించి ఎలా వివరించాలి అనే కోణంలో మాట్లాడుతున్నాను నేను. మనిషి జీవితాన్ని, మానవ వికాసాన్ని సుసంపన్నం చేసే ఇంధనమే వైవిధ్యత. డైవర్సిటీ ఈజ్ ఫ్యూయల్ విచ్ ఎన్‌రిచెస్.. హ్యూమన్ లైఫ్ అండ్ ఎవెల్యూషన్ ఆఫ్ మ్యాన్. సింపుల్‌గా మనం ప్రకృతి గురించి తెలుసుకుంటే తెలిసిపోద్ది వైవిధ్యత ఇంపార్టెన్స్ ఏందో.. ఒక అరణ్యం చూడండి. ఎందుకంటే మనం ఈ మధ్యలో ఆ సెన్సిటివిటీని మరిచిపోయాం. ఒక అరణ్యం చూస్తే ఒక మహా వృక్షం, తర్వాత ఒక చిన్న చెట్టు, ఇంకా చిన్న చెట్టు, పాకే చెట్టు, భూమి లోపల పెరిగే చెట్టు.. ఇన్నిరకాలు.. మనిషే లేడక్కడ. అయినా అంతా సుసంపన్నంగా ఉంటుంది. సూర్యుడి ప్రకాశాన్ని భరించగలిగే మహావృక్షం ఉంటే ఆ ప్రకాశాన్ని తక్కువ భరించేది దాని నీడలో ఉంటుంది. ఇంకా తక్కువ భరించేది దాని నీడలో ఉంటుంది. ఇవన్నీ కలిసే ఉంటాయి. ద హ్యూమన్స్.. జీవరాశులు.. దట్ ఈజ్ ద రిచ్‌నెస్ ఆఫ్ డైవర్సిటీ. సరే మనిషి ఎక్కడ అర్థం చేసుకోవడం లేదంటే.. మనిషికి ఇది ఎలా తోడునీడ అయ్యింది? ప్రకృతిని మనిషి సుసంపన్నం చేస్తున్నాడా? సింపుల్.. జస్ట్ గో బ్యాక్ టు హిస్టరీ అండ్ సీ..

మనకు సిల్క్ రూట్ ఉంది. ఆ రూట్‌పై వ్యాపారం చేసేవాళ్లం. యంగ్‌స్టర్స్ మన హిస్టరీ చదివితే.. ఒక పదిహైదు దేశాలు, ఖండాలతో వ్యాపారం. పర్వతశ్రేణులుండొచ్చు.. డెజర్ట్స్ ఉండొచ్చు.. సముద్రమార్గం కూడా ఉండొచ్చు.. ఆ జర్నీలో వేరే వేరే భాషలు.. వేరే వేరే మనుషులు.. వేరే వేరే వస్తువులు. ఈ జర్నీలో పొదిగిన ఈ వికాసం ఉంది కదా.. వుయ్ షేర్డ్ ద నాలెడ్జ్. వుయ్ షేర్డ్ ద ఫుడ్.. మన భాషను, సాహిత్యాన్ని, ధర్మాన్ని, వివేకాన్నీ పంచుకున్నాం. ఎందుకంటే మనిషికి బేసికల్లీ కొత్తదానికి అడాప్ట్ అయ్యే అద్భుతమైన శక్తి ఉంది. ఎదగడానికి అవకాశం ఉంది. వీళు ఒకే భాష- ఒకే దేశం-ఒకే ధర్మం అంటారు కదా? వీళ్లకెలా అర్థమవ్వాలి. వీళ్లు పూజలో వాడే పట్టుచీర చైనా నుంచి వచ్చింది. మనవాళ్లు చైనాకు ప్రయాణం చేయకపోతే ఇంకా ఆకులు కట్టుకొని తిరిగేవాళ్లు వీరు. షుడెంట్ వుయ్ అండర్‌స్టాండ్.. దటీజ్ సో మచ్ టు లర్న్. ఎన్నో ధర్మాలు వచ్చాయి. ఆ ధర్మంలో ఉన్న గొప్పతనం మనం నేర్చుకోగలిగాం. మన ధర్మంలో ఉన్న దౌర్జన్యాన్ని మనం మార్చుకోగలిగాం. బికాజ్ ఆఫ్ ద ఎక్స్‌పోజర్. ఒక దిగంతాన్నే చూసుకుంటూ బతుకలేం మనం. ఆ దిగంతాన్ని చేరుకున్నాక తర్వాత ఇంకో దిగంతం వస్తుంది. ఎన్ని దిగంతాలు చూస్తామో అంత సుసంపన్నమవుతాం కదా మనం. మనందరం కలిసి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకొని బతుకాలి కదా? భోజనం చూడండి. బిర్యానీలో ఉన్న వైవిధ్యత ఎంత గొప్పది. ఎక్కడినుంచి వచ్చాయి మసాలాలు.. ఎక్కడినుంచి వచ్చింది ఉల్లిపాయ.. ఏ ప్రాంతం నుంచి తెచ్చాం రైస్. అవన్నీ కలిపి ఒక వంట చేస్తే ఆ ఘుమ ఘుమ ఊరిస్తుంది.. అక్కడ వైవిధ్యం కావాలి మనకు. భారతదేశంలో చేపల కూరనే చూడండి. అరేబీయన్ సీ, బే ఆఫ్ బెంగాల్, ఇండియన్ ఓషియన్.. మూడువైపులా సముద్రమున్న దేశం మనది. మనలోనే చేపలు ఎలా వం దుకుంటామని చూస్తే గుజరాత్ టేస్ట్ వేరు. గోవా టేస్ట్ వేరు. మహారాష్ట్ర టేస్ట్ వేరు, మంగళూరు టేస్ట్ వేరు.. కేరళ టేస్ట్ వేరు, తమిళనాడు టేస్ట్ వేరు, ఆంధ్రా టేస్ట్ వేరే. వెస్ట్ బెంగాల్ టేస్ట్ వేరే. వీటిని చూసి సంబురపడుతూ బతుకుతు న్నాం కదా? ఈ అద్భుతమైన, సంభ్రమ వికాసాన్ని, సుసంపన్నతను ఎందుకు కట్టి పడేస్తున్నారంటే..?ఈ దొంగలున్నారు కదా? వాళ్ల అజెండా ఉంది కదా? వాళ్లు దేన్ని వాడుకుంటున్నారంటే%ొ% జెనోఫోబియా అనే ఒక వ్యాధి ఉంది. జెనోఫోబియా.. ఎక్స్‌తో స్టార్టవుతుంది, చదువండి యంగ్ స్టర్స్. మౌలికంగా మన ఊరికి కొత్తవాడు వస్తే.. చిన్న అనుమానం ఉంటుంది కదా.. ఒప్పుకోం. మనకన్న ఇంకో భాష మాట్లాడితే.. మన కన్న డిఫరెంట్‌గా ఏదన్న భోజనం చేస్తుంటే.. మనకన్న డిఫరెంట్‌గా స్కిన్ కలర్ ఉంటే.. అనుమానంగా చూస్తాం. సంశయిస్తాం. కొంచెం భయం ఉంటుం ది. ఇంకేదో%ొ% దీన్ని వాడుకుంటారు వీళ్లు. ఓల్డ్ ట్రిక్ ఇది. బ్రిటీషోడు చేసిందదే కదా? డివైడ్ అండ్ రూల్. కలిసి ఉండకూడదు, చదువుండకూడదు. ఇన్‌స్టింక్ట్‌ను వాడుకుంటారు కదా? ఈ ఇన్‌స్టింక్ట్ వల్ల మనం బ్రెయిన్ వాష్ అవుతాం.



సామాన్యులు జ్ఞానం ఇవ్వకూడదు, ఇన్ఫర్మేషన్ ఇవ్వకూడదు. వాళ్ల మనో వికాసానికి కావాల్సిన ఏ పని కూడా చేయకూడదు. అలాగే పెట్టాలి వాళ్లని. ఇది తరతరాలుగా జరుగుతుంది. హిట్లర్ చేసిందదే. మన కులమే గొప్పది. మొదటి ప్రపంచ యుద్ధం అదే.. రెండవ ప్రపంచ యుద్ధం అదే. వీళ్లు మళ్లీ మళ్లీ అదే చేస్తారు. ఇవ్వాళ మన మహాప్రభు ఉన్నాడు కదా. ఆయన దాకా చెప్తున్నాన్నేను. వీళ్లు మళ్లీ మళ్లీ ఈ జెనోఫోబియాను వాడుతూనే ఉంటారు. ప్రొఫెసర్ గణేష్.. ఆయనతో మాట్లాడుతుంటే.. ప్రకాశ్ చూడు.. మొదటి ప్రపంచ యుద్ధం, రెండవ ప్రపంచ యుద్ధం ఆ తర్వాత మూడవ ప్రపంచ యుద్ధం లేదు. బట్ కోల్డ్ వార్ వచ్చింది.. అమెరికా-రష్యా. ప్రపంచం మొత్తం మీరు ఎవ్వరిసైడ్ ఉన్నారో చెప్పాలి. కోల్డ్ వార్ స్టార్ట్ అవుతుంది. అది బోర్ కొట్టిందా? కమ్యూనల్ వార్. క్రిస్టియన్, ముస్లిం, హిందూ, జైన్.. ఇలా%ొ% ఇప్పుడు కొత్త వార్ స్టార్టయింది. ఇప్పుడు మనం మేల్కోకపోతే. ఇంకో పది సంవత్సరాలు మళ్లీ మనం ఇలాగే ఉండిపోతాం. ఇట్ ఈజ్ కాల్డ్ టారిఫ్ వార్. ఈ దొంగలే చేసేది. ఎలాగైనా ఏదో ఒక వార్ రావాలి. చిచ్చుపెట్టాలి. మనుషులు కలిసి ఉండకూడదు. విశ్వమానవుడు అవ్వకూడదు. అందుకే వీళ్లకు డెమోక్రసీ వద్దు. ప్రపంచాన్ని ఈ వైషమ్యాల సుడిలో దించుతారు. ప్రజాస్వామ్యం వద్దు వీళ్లకు. ఒక నెరేటివ్ బిల్డ్ చేస్తారు. వాళ్లేం చేస్తారంటే.. మీకు ఒక అజెండా ఇస్తరు. మీ ధర్మం డేంజర్‌లో ఉంది అని. మీ భాష డేంజర్‌లో ఉంది అని. మీ కులం డేంజర్‌లో ఉంది అని. మీకేం అర్థం కావట్లేదు. సో మాకు కాంట్రాక్టు ఇవ్వండి, మేం చూసుకుంటాం. ఎంత సింపుల్.. సింపుల్ టెక్నిక్. అంటే కాంట్రాక్టు. మీరేం ఆలోచించకూడదింక. ఒక వైల్డ్ లైఫ్ సైంటిస్ట్ చెప్పాడు. ఎక్కన్నుంచో ఒక డక్ ఓ ప్రాంతానికి వచ్చి ఇక్కడ రెగ్యులర్‌గా ఒక చిన్న చెట్టు మీద తన ఎగ్స్ పెడుతుంది. అందులోంచి ఒక పిల్ల వన్ మంత్ తర్వాత బయటికి వచ్చి కిందకి దూకితే నేరుగా నీళ్లలో పడుతుంది. కానీ ఇప్పుడు నీళ్లు లేవు. పాపం ఆ డక్‌కు ఈ గవర్నమెంట్ దగ్గర డబ్బు లేదనే విషయం తెలియదు. వైవిధ్యతను అర్థం చేసుకుంటే.. రైతు గురించి, మనం ఎన్నుకొనే నాయకుల గురించి.. వాళ్లెందుకు హామీలిచ్చారో దాకా, గవర్నమెంట్‌లో డబ్బు లేని పరిస్థితి ఎందుకు వచ్చిందో.. దాని గురించి, పక్షుల గురించి, రైతుల గురించి కూడా అర్థం చేసుకుంటాం, మనకి ఆ సెన్సిటివిటీ ఉంటే.

మొన్న మళ్లీ ఆ బండీపూర్‌లో ఓ ఐదు నిమిషాలు ఆగి, ఒక చెరువు పక్కన కూర్చున్నాం. అక్కడ ఒక కప్ప క్వాక్ క్వాక్ అనింది. అది ఎందుకు అరుస్తున్నది అని ఆయననడిగా.. ప్రకాశ్ నీకు వినిపిస్తుంది. ఇది వినపడనివారికి నేనెలా చెప్పాలి? అంటే అది ఈ టైంలో తన గర్ల్‌ఫ్రెండ్‌ను పిలుస్తుంది. మీరు ఆ మధ్యలో రోడ్డేసి వా.. వా.. అంటే రెండు కప్పలు మాట్లాడుకోవడానికి అడ్డుగా ఉన్నార్రా మీ మనుషులు. ప్రకృతి గురించి, ఈ వైవిధ్యాన్ని కాపాడుకోవటం గురించి మనకు ఇలాంటి సున్నితత్వం లేకుంటే ఎలా? సో ఈ వైషమ్యాలు కానీ, ఈ పాలిటిక్స్‌ను కానీ ఇవన్నింటినీ మనం అర్థం చేసుకోవాలంటే మనం ఫస్టు సెన్సిటివ్ అవ్వాలి. మనకు ఎడ్యుకేషన్ కావాలి. వచ్చే తరాలకు, యంగ్‌స్టర్స్‌కు, మన పిల్లలకు.. వై ఈజ్ డైవర్సిటీ సో ఇంపార్టెంట్ అనేది తెలుసుకోవాలి. యూనిటీ ఇన్ డైవర్సిటీ అని మనం అంటున్నాం. వాళ్లు యూనిఫామిటీ ఇన్ డైవర్సిటీ అంటున్నారు. అందరికీ ఒకే చెడ్డి వేసేస్తే, ఒకే భాషలో మాట్లాడాలని చెప్పేస్తే యూనిఫామిటీ అనుకుంటున్నారు. అది కాదు. ఒక కప్ప గురించి ఎందుకు ఆలోచించాలంటే ఈ యావత్ ప్రపంచంలో, మానవ వికాసంలో, ఈ నేచర్‌లో ఒక కప్ప మనుగడకు ఎంత ప్రాముఖ్యత ఉందో.. అంతే ప్రాముఖ్యత మనిషికి కూడా ఉంది. ఆల్ ఆర్ ఈక్వల్. మైనారిటీ, మెజారిటీ అనేది లేదు. కానీ వీళ్లకు మెజారిటీ కావాలి. నెమలి కాదు. నేషనల్ యానిమల్ ఆవు కావాలి, టైగర్ కాదు.

# పుస్తకాలు చూసి సర్జరీలు చేయవద్దు

**పూర్తి అనుభవం వచ్చాకే చేయాలి**

**లేకపోతే పేషంట్లకు ఇన్ఫెక్షన్లు, ఇతరత్రా సమస్యలు**

**ఇతర ఆపరేషన్లకు సౌందర్య శస్త్రచికిత్సలకు తేడా ఉంది**

**అందాన్ని మెరుగుపర్చాలేగానీ చెడగొట్టొద్దు**

**ప్లాస్టిక్ సర్జన్లకు డాక్టర్ సంజయ్ పరాశర్ పిలుపు**



పుస్తకాలు చూసి శస్త్రచికిత్సలు చేయవద్దని, పూర్తిస్థాయిలో అనుభవం వచ్చిన తర్వాతే చేయాలని ప్లాస్టిక్ సర్జన్లకు దుబాయికి చెందిన సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్ పిలుపునిచ్చారు. 'మిగిలిన విభాగాలలో చేసే చికిత్సలు వేరు. ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులు చేసే చికిత్సలు వేరు. కాస్త అందంగా కనపడాలని, ఉన్న లోపాన్ని సరిచేయించుకోవాలని వచ్చేవాళ్లకు మనం పూర్తి సంతృప్తి ఇవ్వగలగాలి. అంతేతప్ప ఉన్నదాన్ని మరింత చెడగొడితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయి. చికిత్స తర్వాత ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అవి రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా లైపోసక్షన్, కాస్మెటిక్ శస్త్రచికిత్సలు, ముక్కు, గడ్డం, బుగ్గలు వంటివి సరిచేయించుకునే చికిత్సలు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటివి చాలా సున్నితమైనవి. వీటి విషయంలో రోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి' అని సూచించారు. హైటెక్ సిటీలోని టీ-హబ్ వేదికగా రెండురోజుల పాటు జరిగే 'సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సు' శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ పరాశర్ ప్రసంగించారు. ప్లాస్టిక్, ఈస్థటిక్ సర్జరీలు చాలా సంక్లిష్టమైనవని, నూటికి నూరుశాతం కృషిచేసినా కూడా కొన్ని సందర్భాల్లో అనుకోని అవాంతరాలు ఎదురవుతాయన్నారు. సమగ్రమైన అనుభవం ఉంటేనే వాటిని అధిగమించగలమని, కేవలం పుస్తకజ్ఞానంతో సాధ్యం కాదని హితవు పలికారు. డాక్టర్ గురుకర్ణ వేముల మాట్లాడుతూ.. ఈ చికిత్సలు చేయించుకోవడానికి ముందు సరైన వైద్యులు, ఆస్పత్రుల గురించి పేషంట్లు సమాచారం సేకరించి ఆ తర్వాతే నిర్ణయం తీసుకోవాలన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లాంటివాటిలో నమోదయ్యారా అన్నది సరిచూసుకోవాలని సూచించారు. తగిన శిక్షణ లేని వాళ్లు చికిత్సలు చేయడం వల్ల పలురకాల సమస్యలు వస్తున్నాయన్నారు. సౌందర్య శస్త్రచికిత్సల గురించి మనదేశంలో వైద్యులకు ఇంకా శిక్షణ మెరుగుపడాలని, శిక్షణ కార్యక్రమాలు పెంచాలని సూచించారు. ప్లాస్టిక్ సర్జరీ చేసేటప్పుడు అనుక్షణం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# టారిఫ్‌ల టెన్షన్ వేళ.. వచ్చేనెల ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ..!



బ్రాంగ్ తో ^ప్త అగ్రరాజ్యం అమెరికా అధిక టారిఫ్‌ల వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల యూఎస్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిసింది. ఈ పర్యటన సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్-మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అంతేకాదు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా పలువురు విదేశీ నేతలతో ప్రధాని ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు తెలిసింది. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా యూఎన్ రిలీజ్ చేసింది. ఆ లిస్ట్‌లో భారత ప్రధాని మోదీ పేరు ఉంది. దీంతో ఆయన యూఎస్ పర్యటనకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటుందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు.

# టీ, కాఫీలు తాగేటప్పుడు వీటిని తింటున్నారా..? అయితే జాగ్రత్త..!



చాలా మంది టీ లేదా కాఫీ తాగేటప్పుడు లేదా తాగడానికి ముందు పలు రకాల స్నాక్స్ తింటుంటారు. వాటిల్లో రస్క్ కూడా ఒకటి. ఈ మధ్య కాలంలో ఇది చాలా పాపులర్ అయింది. ఇంట్లో లేదా బయట ఎక్కడ టీ, కాఫీ తాగినా స్నాక్స్ లాగా రస్కులను తింటున్నారు. అయితే వాస్తవంగా చెప్పాలంటే ఇవి ఆరోగ్యానికి అసలు ఏమాత్రం మంచివి కావని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రస్కులను తినడం వల్ల ఆరోగ్యానికి హాని జరుగుతుందని అంటున్నారు. వీటిని మైదా పిండి, చక్కెర, నూనె, ఈస్ట్, కోడిగుడ్లు, పాల పొడి వంటివి ఉపయోగించి తయారు చేస్తారు. అయితే రస్కులు వాటిని తయారు చేసే విధానం వల్ల వాటిలో వాడే పదార్థాల్లో ఉండే పోషకాలను పూర్తిగా కోల్పోతాయి. ఈ క్రమంలో అలాంటి రస్కులను తింటే తీవ్రమైన నష్టాలు ఉంటాయి.

**బరువు పెరుగుతారు..**

రస్కులలో మైదా అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మైదాలో ఫైబర్, విటమిన్లు, మినరల్స్ అసలు ఏమాత్రం ఉండవు. అందువల్ల మైదాతో తయారు చేసే రస్కులను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఇది అసలు ఏమాత్రం మంచిది కాదు. డయాబెటిస్ లేని వారికి కూడా రస్కులను తరచూ తింటే డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కనుక వీటిని తినడం మానుకోవాలి. రస్కులలో అధిక మొత్తంలో చక్కెర, హైడ్రోజినేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి హాని చేస్తాయి. అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. దీంతో బీపీ అధికమవుతుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశాలు పెరుగుతాయి. రస్కులలో ఫైబర్ అసలే ఉండదు. ఇది జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలను కలగజేస్తుంది. రస్కులలో ప్రోటీన్లు కూడా ఉండవు కనుక వీటిని తింటే రోజు మొత్తంలో ఇతర సమయాల్లో ఆకలి ఎక్కువ అవుతుంది. దీంతో ఆహారం అధికంగా తింటారు. ఇది బరువు పెంచేలా చేస్తుంది. కనుక రస్కులకు దూరంగా ఉంటే మంచిది.

**షుగర్ వస్తుంది..**

రస్కులను తరచూ తినే వారికి షుగర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని తింటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అధికంగా పెరుగుతాయి. ఆ లెవల్స్‌ను తగ్గించేందుకు క్లోమగ్రంథి అధికంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఇలాగే జరిగితే క్లోమ గ్రంథి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కోల్పోతుంది. దీంతో షుగర్ లెవల్స్ అధికంగా పెరిగిపోయి డయాబెటిస్ వస్తుంది. అలాగే రక్తంలో ఇన్సులిన్ లెవల్స్ మరీ అధికంగా ఉంటే ఆహారం కొవ్వుగా మారుతుంది. దీన్ని శరీరం నిల్వ చేసుకుంటుంది. దీని వల్ల దీర్ఘకాలంలో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఇన్సులిన్ ఉత్పత్తి సరిగ్గానే ఉన్నా కొవ్వు కారణంగా శరీరం దాన్ని సరిగ్గా వినియోగించుకోలేదు. దీంతో షుగర్ లెవల్స్ అంతకంతకూ పెరిగిపోతాయి. చివరకు డయాబెటిస్‌కు దారి తీస్తుంది. రస్కులను తినడం వల్ల ఈ ప్రమాదం పెరుగుతుంది కనుక వీటిని తినడం మానేస్తే మంచిది.

**జీర్ణ సమస్యలు వస్తాయి..**

రస్కులలో క్యాలరీలు అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు, చక్కెర. కొవ్వులు అధికంగా ఉంటాయి. కనుక తరచూ వీటిని తింటే శరీరంలో చేరే క్యాలరీలు పెరిగిపోతాయి. కొవ్వు అధికంగా పేరుకుపోతుంది. దీని వల్ల బరువు పెరుగుతారు. రస్కులలో ఫైబర్ ఉండని కారణంగా అవి సులభంగా జీర్ణం కావు. దీని వల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. కొందరికి పొట్టలో తరచూ విపరీతమైన అసౌకర్యం ఏర్పడుతుంది. రస్కులను తింటే దీర్ఘకాలంలో క్యాన్సర్ వచ్చే ప్రమాదం సైతం పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. రస్కులను తినడం వల్ల పోషకాహార లోపం సంభవించే అవకాశాలు కూడా ఉంటాయని చెబుతున్నారు. కనుక వీటిని తినడం పూర్తిగా మానేస్తే ఆరోగ్యంగా ఉండవచ్చు. ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి.

SPHOORTI PATRIKA (Telugu Daily) | PRGI Reg. No. APTEL/26/A0542 | Publisher, Printer & Editor: NarasaNaidu Boya | Printed at: Rajeswari Printers, Kurnool |
Place of Publication: Kurnool, Andhra Pradesh | Cell: 8179446036, 7794947413 | Email: sphoortipatrika@gmail.com | Website: www.sphoortipatrika.com